# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్ ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శనివారం | 04 జులై, 2026 | పేజీలు :06


## ఆపరేషన్ ముస్కాన్ 12 విజయవంతం చేయాలి




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ 12 విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఆపరేషన్ ముస్కాన్ 12 పై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం శుక్రవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ తప్పిపోయిన, పారిపోయిన పిల్లలు బాల కార్మికులుగా మారిన వారిని సంరక్షించి వారి స్వస్థలాలకు చేర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం ప్రతి సంవత్సరం జనవరి, జూలై నెలల్లో ఆపరేషన్ ముస్కాన్ పేరుతో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 1 వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. తప్పిపోయిన, పారిపోయిన పిల్లల్ని వెతికి పట్టుకునేందుకు ప్రభుత్వం నిర్దేశించిన దర్పన్ యాప్ ను వినియోగించాలని సూచించారు. అలాగే ఇటుక బట్టీలు, బేకరీ షాపులు, మెకానిక్ షాప్ లు, ఇండ్ల నిర్మాణ పనులు, వ్యవసాయ పనులు, ఇతర పనుల్లో బాల కార్మికులతో పని చేయించుకోవడం నేరమని స్పష్టం

తరువాయి 2లో

# ఎఫ్‌సిఐ గోదాములలో రేక్ మూమెంట్‌ను పెంచేందుకు చర్యలు

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** జిల్లాలోని ఎఫ్.సి. ఐ గోదాములో ఉన్న రేక్ మూమెంట్ పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో సీఎంఆర్ రైస్ డెలివరీ, అంశాలపై ఎఫ్.సి.ఐ, సివిల్ సప్లై అధికారులు మరియు రైస్ మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో సీఎంఆర్ రైస్ డెలివరీ ప్రక్రియను పర్యవేక్షించడంతో పాటు,రైస్ మిల్లర్లు,ఎదుర్కొంటున్న సమస్యలపై పెద్దపల్లి జిల్లాలోని ఎఫ్.సి. ఐ గోదాములో ఉన్న రేక్ మూమెంట్ పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.సీఎంఆర్ రైస్ డెలివరీలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని, ఎఫ్.సి.ఐ వారు సమన్వయంతో వ్యవహరించి బియ్యం సేకరణను వేగవంతం చేయాలని మరియు జిల్లాకు సంబంధించి వ్యాగన్ మూమెంట్ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.సీఎంఆర్ రైస్ డెలివరీలో ఎటువంటి జాప్యం జరగకూడదని, లక్ష్యం మేరకు బియ్యాన్ని సకాలంలో అందజేయాలని రైస్ మిల్లర్లను ఆదేశించారు.ఈ సమావేశంలో డి.సి.ఎస్.ఓ.శ్రీనాథ్, డి.ఎం.శ్రీకాంత్,సివిల్ సప్లై కార్పొరేషన్ డి.ఎం రవి కుమార్, రైస్ మిల్లర్లు,సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి
## ప్రభుత్వ విప్ ఆది అభినందనలు



### పాత్రికేయుల సంక్షేమానికి
## సహకారం అందిస్తాం

**ప్రజా పక్షం/ వేములవాడ టౌన్:** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే–హెచ్–143) వేములవాడ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు సయ్యద్ లాయక్ పాషా, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక నరసయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ ల నేతృత్వంలో నూతన కార్యవర్గ సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు గజమాలలు వేసి ఘనంగా సత్కరించారు.అనంతరం నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులను ఆది శ్రీనివాస్ శాలువాలు కప్పి సన్మానిస్తూ అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పాత్రికేయులు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలను నిష్పాక్షికంగా వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా పాత్ర ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఐక్యంగా పనిచేస్తూ పాత్రికేయుల సంక్షేమం, వృత్తి విలువల పరిరక్షణకు కృషి చేయాలని ఆకాంక్షించారు. పాత్రికేయుల సమస్యల పరిష్కారం, ప్రెస్ క్లబ్ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం పట్టణంలోని ప్రెస్ భవనంలో వివిధ జర్నలిస్టు సంఘాల సభ్యులకు అవకాశం కల్పించాలని విప్ కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కార్యవర్గం, గౌరవ సభ్యులు కొత్వాల్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సిహెచ్ దేవరాజ్, విష్ణు,క్యాషియర్ పంపరి నాగరాజు, జిల్లా రమేష్, సయ్యద్ ఫహద్ పాషా, చౌటుపల్లి వెంకటేష్, దెబ్బేటి ప్రవీణ్, శ్రీరామోజు వేణు,సంటి రాజేందర్ షబ్బీర్, నవీన్, బుర్ల ప్రదీప్, బండి రజిని, బుర్ల సందీప్, లక్ష్మీనారాయణ, వేణు, సభ్యులు పాల్గొన్నారు.

### బిగ్ బాస్ షోను తలపిస్తోన్న
# కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు

### కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ హాట్ కామెంట్స్

**ప్రజాపక్షం/కరీంనగర్:** ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో బాధ్యులపై ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడం వెనుక కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ జరగడమే కారణమని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ ఎదుగుతోందని, చాపకింద నీరుగా బలపడుతుండటంతో ఓర్వలేకే కాంగ్రెస్ , బీఆర్ఎస్ నేతలు కుమ్మక్కై బిగ్ బాస్ షోను తలపించేలా డ్రామాలాడుతున్నాయని ఎద్దేవా చేశారు. ఈ రెండు పార్టీలు అవినీతి పార్టీలేనని, అందుకే బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. అందుకే తెలంగాణ ప్రజలు ఆ రెండు పార్టీలను ఎలిమినేషన్ చేసి డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని కోరుకుంటున్నారని అన్నారు. వీబీజీ రామ్ జీ పథకం ద్వారా పేదలకు ఎంతగానో మేలు జరగడంతోపాటు గ్రామాల్లో ఆస్తుల సృష్టి జరగబోతోందని అన్నారు. ఈ పథకాన్ని అమలు చేస్తే కేంద్రానికి మంచి పేరు స్తుందని అక్కసుతోనే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం దుర్మార్గమన్నారు. ఈ స్కీం అమలు రాష్ట్రానికి భారం అనిపిస్తే ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లాలే తప్ప కోర్టుకు వెళ్లి అడ్డుకోవాలనుకోవడం దారుణమన్నారు. ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల్లో విద్యార్థులు, టీచర్లకు బ్రేక్ ఫాస్ట్, పాలు, లంచ్ సౌకర్యం కల్పించడాన్ని కేంద్ర మంత్రి స్వాగతించారు. ఒకవైపు బ్రేక్ పాస్ట్ సౌకర్యం కల్పిస్తూనే మరోవైపు రాష్ట్రంలో ఏకంగా 10 వేల స్కూళ్లను మూసివేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడమేంటని ప్రశ్నించారు. రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా పాఠశాలలను మూసివేయడం దుర్మార్గమన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ కేవీపీ చంద్ర(టింకు)తో కలిసి శుక్రవారం కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 37వ డివిజన్ లో రూ.77 లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. షాషామహల్ ప్రాంతంలో ఓపెన్ జిమ్ ను ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా అందరి సహకారంతో కరీంనగర్ ను అభివృద్ధి చేస్తున్నామని,

తరువాయి 2లో



# సింగరేణిని రాజకీయ వేదికగా మార్చొద్దు

- కార్మికుల చెమటను రాజకీయ లాభాలకు వాడుకోవద్దు
- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్



**ప్రజాపక్షం/రామగిరి :** సింగరేణి బొగ్గు ఉత్పత్తి, గణాంకాల అంశంపై మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడాలనుకుంటే దానికి సరైన వేదిక తెలంగాణ శాసనసభ,అక్కడ ప్రభుత్వం సమాధానం చెబుతుంది. అవసరమైతే సింగరేణి యాజమాన్యం కూడా అధికారికంగా వివరణ ఇస్తుంది.కానీ గనుల పైకి వచ్చి పదేపదే మీడియా సమావేశాలు నిర్వహిస్తూ సింగరేణి సంస్థను రాజకీయ వివాదాల్లోకి లాగడం వల్ల సంస్థ ప్రతిష్ట, పరపతి దెబ్బతింటుందని ఏఐటీయూసీ ఆందోళన వ్యక్తం చేస్తోంది.2017లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు 7.5 మిలియన్ టన్నుల అదనపు బొగ్గు ఉత్పత్తి చూపించారని,అప్పట్లో ప్రస్తుతం మీ పార్టీలో ఉన్న ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ బహిరంగంగా విమర్శించిన విషయం అందరికీ తెలిసిందే.అప్పుడు మౌనం వహించిన వారు, ఇప్పుడు నీతులు చెప్పడం రాజకీయ అవకాశవాదానికి నిదర్శనం. మేము ఈవిధానాన్ని తప్పు పడుతున్నాము. ప్రభుత్వం ఎవరిదైనా, తప్పు జరిగితే ప్రశ్నించడం మా విధానం. బొగ్గు ఉత్పత్తి గణాంకాలపై అనుమానాలు ఇవాళ కొత్తగా వచ్చినవి కావు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో కూడా ఇదే తరహా ఆరోపణలు చేస్తూ హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్లు నిర్వహించారు. అధికారంలో ఉన్నా,ప్రతిపక్షంలో ఉన్నా రాజకీయ అవసరాలకు అనుగుణంగా సింగరేణిని రాజకీయ వేదికగా ఉపయోగించుకోవడం కొత్త విషయం కాదు. అయితే ఏఐటీయూసీ మాత్రం మొదటి నుంచీ ఒకే విధానాన్ని అనుసరిస్తోంది. సింగరేణి ప్రతిష్టకు భంగం కలిగించే రాజకీయాలను ఎవరు చేసినా తీవ్రంగా వ్యతిరేకిస్తాం.మా యూనియన్ గౌరవ అధ్యక్షులు కూనంనేని సాంబశివరావు ఎమ్మెల్యే మిమ్మల్ని ఎల్లప్పుడూ హరీష్ రావు అని గౌరవంగా సంబోధించారు. కానీ మీరు మాత్రం సాంబశివరావు అంటూ పదే పదే ఏకవచనంతో సంబోధించడం హుందాతనం కాదు. విభేదాలు ఉండవచ్చు, విమర్శలు చేయవచ్చు. కానీ వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీసే భాషను ఉపయోగించడం ప్రజాస్వామ్య సంస్కృతికి తగదు. రాజకీయాల్లో పరస్పర గౌరవాన్ని పాటించడం ప్రతి నాయకుడి బాధ్యత.మణుగూరు డీప్‌సైడ్ బ్లాక్ సింగరేణికే కేటాయించాలని నిరాహార దీక్షలు చేస్తున్న సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నకు మా గౌరవ అధ్యక్షులు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఇచ్చిన సమాధానాన్ని కావాలనే వక్రీకరించడం దురుద్దేశపూరితం.ఆయన ఎక్కడా బొగ్గు ఎక్కడ కూడా దొంగతనం జరగలేదు అని చెప్పినాడు,టార్గెట్ రాకున్నా వచ్చినట్లు తప్పుడు లెక్కలు చూపెట్టారు ఈ పద్ధతి కూడా తప్పే అనికూడా చెప్పారు.బొగ్గు దొంగతనం జరిగింది అని చెప్పడం వలన కష్టపడి బొగ్గు ఉత్పత్తి చేస్తున్న కార్మికులు అయోమయానికి గురవుతారని మాత్రమే పేర్కొన్నారు. కార్మికుల గౌరవాన్ని, సంస్థ విశ్వసనీయతను కాపాడాలన్నదే ఆయన ఉద్దేశం. ఆ వ్యాఖ్యలను రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. రాబోయే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సంస్థ పేరును రాజకీయ ప్రచారానికి ఆయుధంగా మార్చే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలి.దాదాపు 70 వేల మంది శాశ్వత, కాంట్రాక్టు కార్మికుల భవిష్యత్తు, వారి కుటుంబాల జీవనోపాధి కంటే ఎన్నికలకే ప్రాధాన్యం ఇవ్వడం అత్యంత దురదృష్టకరం. గనులపైకి వందలాది మంది బొగ్గు చూపెట్టండని అధికారులపై వత్తిడి తెస్తే కార్మికులు అభద్రతకు లోనవుతారు. సింగరేణిని రాజకీయ రణరంగంగా మార్చే ప్రతి ప్రయత్నాన్ని కార్మికలోకం తిప్పికొడుతుంది.ఇప్పటికే సింగరేణిలో అధిక రాజకీయ జోక్యం, అవినీతి వల్ల సంస్థ తీవ్రంగా నష్టపోయింది.సింగరేణికి భవిష్యత్తులేని పరిస్థితి నెలకొంది.

## విరసం సభలను విజయవంతం చేయండి



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : జూలై 5 న విరసం ఆవిర్భావ దినం సందర్భంగా హైదరాబాద్ బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దేశంలో ప్రజా పోరాటాల పై అమలవుతున్న ఫాసిస్ట్ నిర్బంధానికి ,అణిచివేతకు వ్యతిరేకంగా సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో పోరాటం కొనసాగించాలానే నేపథ్యంతో ఆదివారంనాడు ఉదయం 10 గంటల నుంచి సాయింత్రం 5.30 వరకు సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ ఆయా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద పల్లి అంబేద్కర్ చౌరస్తా వద్ద కరపత్రం వాల్ పోస్టర్ విడుదల చేయడం జరిగిందనీ విరసం సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు పలువురు మాట్లాడుతూ భారతదేశంలో ఫాసిజం ప్రత్యేకతలు,బుల్డోజర్ రాజకీయాలు మతమైనారిటీల అస్తిత్వం పై దాడి,తెలుగు సాహిత్యంలో ఇటీవల ధోరణులు మార్క్సిస్ట్ దృక్పథం అనే అంశాలపై ఉపన్యాసాలు, విరసం కళా బృందం నాటక ప్రదర్శనతో పాటు వివిధ కళాబృందాల ఆధ్వర్యంలో సంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయనీ, ఎప్పటిలాగానే మీ స్నేహపూర్వక సహకారాన్ని అందిస్తూ ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొనాలని ఈ సందర్భంగా తీసుకువచ్చిన కరపత్రాన్ని,పోస్టర్లను విరసం ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో బాలసాని రాజయ్య విరసం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్, మాదన కుమారస్వామి సి ఎల్ సి రాష్ట్ర సహాయ కార్యదర్శి, మార్వాడి సుదర్శన్ డివిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గాండ్ల మల్లేశం తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి, దేవి సత్యం తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘ గౌరవ అధ్యక్షులు, ఐత బాపు కార్మిక సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్ నంబయ్య కార్మిక సంఘం నాయకుడు, శ్రీపతి రాజగోపాల్ పౌర హక్కుల సంఘం ఈ సి మెంబర్, బండి శంకర్ గౌడ్ సి ఎల్ సి జిల్లా మెంబర్, బట్టారి ఆంజనేయస్వామి టియుజెసి రాష్ట్ర సెక్రెటరీ, బండారి గంగారాజ్ టి యు జేఏసీ జిల్లా వైస్ ప్రెసిడెంట్, ఆజాద్ ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పెద్దపల్లి తదితరులు పాల్గొన్నారు.


## అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కొలనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్యులు,సిబ్బంది విధి సమయాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన అన్ని రకాల మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని సూచించారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన చికిత్స అందించాలని, ఆరోగ్య సేవలపై ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్పష్టం చేశారు.అనంతరం కొమిర గ్రామంలో భూభారతి ద్వారా వ్యవసాయ భూములకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అర్హులైన రైతుల దరఖాస్తులను నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని, భూ సమస్యల పరిష్కారంలో పారదర్శకత పాటించాలని అధికారులను ఆదేశించారు.ఓదెలలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్, పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న పనులను వెంటనే పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు.నిరుపయోగంగా ఉన్న ఐకేపీ భవనాన్ని పునరుద్ధరించి, అవసరమైన మరమ్మత్తులు చేపట్టి, కోర్టు భవనంగా వినియోగించే విధంగా తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఎం.పీ.డీ.వో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి మండలంలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను 10 రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇతర అభివృద్ధి పనులన్నింటినీ ఈ నెలాఖరులోగా పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, భూభారతి, మీ సేవ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, ఎలాంటి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఓదెల మండల కేంద్రంలోని ఇందిరమ్మ గృహాలను పరిశీలించారు.లబ్ధిదారులు నూతి సరోజ, నూతి రజిత నిర్మించుకున్న 2 ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో బిల్లులు అందడంతో సొంత ఇల్లు నిర్మించుకోవడం ఆనందంగా ఉందని లబ్ధిదారులు కలెక్టర్‌కు తెలిపారు.మండలంలో మంజూరైన ఇందిరమ్మ గృహాల నిర్మాణాన్ని వేగవంతం చేసి, అన్ని ఇళ్లను జులై 15 వరకు పూర్తి చేయించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.పూర్తయిన ఇళ్లలో లబ్ధిదారులు గృహప్రవేశాలు నిర్వహించి ఆత్మవిశ్వాసంతో జీవనం సాగించేలా అవసరమైన సహకారం అందించాలని సూచించారు.

## మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో విద్యార్థుల రవాణా కష్టాలకు చెక్




ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలోని ముత్తారం మండలం దర్యాపూర్ మోడల్ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన నూతన టీజీ.ఎస్.ఆర్టిసి బస్సు సర్వీసును శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పిటిసి చొప్పరి సదానందం,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ,స్థానిక సర్పంచ్ రాజయ్య తో పాటు తదితరుల ఆధ్వర్యంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు ప్రత్యేక సహకారంతో ఈ నూతన బస్సును జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందం ముఖ్య అతిథిగా విచ్చేసి జెండా ఊపి ప్రారంభించడం జరిగిందన్నారు. అలాగే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రతి విద్యార్థికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు.విద్యార్థులు ఈ రవాణా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ముత్తారం సర్పంచుల ఫోరం అధ్యక్షులు బియ్యాని శివకుమార్,ముత్తారం మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బక్కతట్ల నిధులు, అధికారులు,గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అదనపు బాధ్యతలు స్వీకరించిన అంబర్ కిశోర్ ఝా

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా కాలేశ్వరం జోన్1 డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీఐజీ)గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జారీ చేసిన ఉత్తర్వుల మేరకు కాలేశ్వరం జోన్ 1 డీఐజీగా అదనపు బాధ్యతలు అప్పగించగా, శుక్రవారం ఆయన ఆ బాధ్యతలను స్వీకరించారు.ఈ సందర్భంగా ఏఓ శ్రీనివాస్,జోన్ సూపరింటెండెంట్ సందీప్ కుమార్ డీఐజీ అంబర్ కిశోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డీఐజీ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ, కాలేశ్వరం జోన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తూ,నేరాల నియంత్రణతో పాటు చట్టవ్యతిరేక కార్యకలాపాలను సమర్థవంతంగా అరికట్టేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## పేదవాడికి ఒక న్యాయం.. అధికార పార్టీకి ఒక న్యాయమా..?

**ప్రజాపక్షం/ముత్తారం :** పేదవాడు భూమిని దున్నుకుంటే తప్పు..అదే అధికార పార్టీ నాయకులు దున్నుకుంటే తప్పులేదా? అధికారంలో ఉన్నామనే అహంకార్ధంతో పేదల భూములను లాక్కోవడం ఎంతవరకు సమంజసం? అని మంథని డివిజన్ దళిత నాయకుడు ఊట్ల శ్రీను తీవ్రంగా మండిపడ్డారు.పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గం, ముత్తారం మండలం దర్యపూర్ గ్రామ శివారులోని సర్వే నెంబర్ 144 లో గల భూమి వివాదంపై ఆయన శుక్రవారం అధికారుల తీరును తీవ్రంగా తప్పుపట్టారు.

బాధిత సామాన్యులపై వేధింపులు : ఈ సందర్భంగా ఊట్ల శ్రీను మాట్లాడుతూ దర్యపూర్ శివారులోని సదరు సర్వే నెంబర్ భూమిలో స్థానిక సామాన్య, పేద ప్రజలు సాగు చేసుకుంటుంటే రెవెన్యూ శాఖ అధికారులు వచ్చి వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పేద రైతులను అరెస్టులు చేయడం,వారి వ్యవసాయ వాహనాలను బలవంతంగా సీజ్ చేయడం వంటి చర్యలతో అధికారులు సామాన్యులను వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఐటీ మంత్రి అండతోనే అక్రమాలు?** ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అండదండలు ఉన్నాయనే ధీమాతో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక గౌరవప్రదమైన సర్పంచ్ ఏకంగా 15 ఎకరాల భూమిని అక్రమంగా దున్నుకుంటూ విచ్చలవిడిగా వ్యవర్తిస్తున్నారని శ్రీను ఆరోపించారు. నన్ను ఎదిరించేవాడే లేడు అన్నట్లుగా సదరు సర్పంచ్ వ్యవహరిస్తుంటే, మండల రెవెన్యూ అధికారులు ఎందుకు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. తప్పు చేసిన అధికార పార్టీ నాయకులను వదిలేసి,నిజాయితీగా బ్రతికే పేదవారిని దోషులుగా చిత్రించడం దుర్మార్గమన్నారు.

**కలెక్టర్ చొరవ తీసుకోవాలి :** ఈ వివక్షతపై పెద్దపల్లి జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.రెవెన్యూ డిపార్ట్మెంట్ పక్షపాత వైఖరిని వీడి,ఈ భూమి సమస్యను తక్షణమే నిష్పక్షపాతంగా పరిష్కరించి పేద రైతులకు న్యాయం చేయాలని ఊట్ల శ్రీను కోరారు.

## నిరుపేదలకు మున్నూరు కాపు సంఘం ఎల్లవేళలా అండగా ఉంటుంది

పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు జడల సురేందర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లా వ్యాప్తంగా ఉన్న నిరుపేద మున్నూరు కాపులకు మున్నూరు కాపు సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షులు జడల సురేందర్ అన్నారు. గత జూన్ నెలలో కురిసిన అకాల వర్షాల వల్ల జిల్లాలోని అందుగులపల్లి గ్రామంలో కామ వెంకన్న, సుగుణల ఇల్లు పూర్తిగా కూలిపోయి నిరాశ్రయులైన ఘటనపై జడల సురేందర్ ఆధ్వర్యంలో సంఘం తక్షణమే స్పందించి, సభ్యుల గ్రూప్ ద్వారా సుమారు 35,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని సేకరించి శుక్రవారం రోజున బాధితులకు ఇల్లు సరిచేసుకోవడానికి అవసరమైన రేకులు ఇప్పించడంతో పాటు, మిగిలిన 6,000 రూపాయల నగదును ఆయన చేతుల మీదుగా బాధితులకు నేరుగా అందజేశారు. విపత్కర పరిస్థితుల్లో కుల బాంధవులను ఆదుకోవడానికి మున్నూరు కాపు కుల బంధువులంతా పెద్ద మనసుతో స్పందించడం అభినందనీయమని సురేందర్ కొనియాడారు. పూదరి శ్రీనివాస్, జక్కుల రాజేశం మల్క విక్రాంత్, జంబు పటేల్,పూదరి కార్తీక్ అందుగులపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు అడువాల మల్లయ్య,గ్రామ శాఖ నాయకులు అడువాల శ్రీను,అడువాల రామన్న,మామిడి అజయ్, పాల్గొన్నారు.

## నేడు మండలంలో ఎమ్మెల్యే సంజయ్ పర్యటన

ప్రజాపక్షం /మల్లాపూర్ : మండలంలోని 13 గ్రామాలలో స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ శనివారం పర్యటించనున్నారని మండల బి.ఆర్.ఎస్ నాయకులు అన్నారు. మల్లాపూర్,ముత్యంపేట రాఘవపేట మొగిలిపేట ఓబులాపూర్ తండా, వాల్గొండ, గొర్రెపల్లి వేంపల్లి వెంకటరావుపేట రేగుంట,సాతారం గుండంపల్లి చిట్టాపూర్ కు గ్రామాలలో పర్యటించి లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను స్వయంగా అందించనున్నారని మండల బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని మండల నాయకులు కోరారు.

## పండగ వాతావరణంలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు.

ప్రజాపక్షం / సారంగాపూర్ : జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పోతారం గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి వనిత సాయిలు, మామిడి సూరమ్మ నర్సయ్య, పందిరి సుజాత పోచయ్య, లక్ష్మి మల్లేశం, సారంగాపూర్‌కు చెందిన చిట్యాల లక్ష్మి మల్లయ్య, వడ్డెర కాలనీకి చెందిన వల్లెపు రేఖ లక్ష్మి రాజం, లచ్చక్కపేట కు చెందిన తోట లావణ్య రాజేందర్‌లకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు శుక్రవారం గృహ ప్రవేశం జరిగాయి. ఇట్టి కార్యక్రమానికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక ఇందిరమ్మ ఇళ్లు జగిత్యాలకు మంజూరు అయినట్లు తెలిపారు. అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. గ్రామ గ్రామానా పండుగ వాతావరణంలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి ఏడాది 2వేల చొప్పున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు.అలాగే రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కేంద్రీయ విద్యాలయానికి చల్‌గల్ లో 5ఎకరాల స్థలం కేటాయించారని, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలకు జగిత్యాల జిల్లా ప్రజల తరుపున ధన్య వాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపివో సలీం, సర్పంచులు అరుణ శేఖర్, జ్యోతి శ్రీనివాస్, మాదవి బాపిరాజు, శంకర్ రెడ్డి, శేఖర్, రాధ రాజు, అశ్విని రమేష్, ఉప సర్పంచ్ లావణ్య మల్లేష్, జలపతి నారాయణ రావు, ఆనంద్, మాజీ ఎంపిటిసి రవీందర్ రావు, సుధాకర్ రావు, నరసింహారెడ్డి, ఉప సర్పంచ్ ప్రభాకర్, మండల వార్డు సభ్యుల ఫోరం నాంపల్లి, నాయకులు గంగారెడ్డి, హరీష్, రామానుజం, శ్రీనివాస్, రాజు, ఉపేందర్ నాయకులు తదితరులు ఉన్నారు.

## ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

ప్రజాపక్షం/వీర్నపల్లి: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉపాధి హామీ పథకం పై సామాజిక తనిఖీ ప్రజావేదిక ను శుక్రవారం జిల్లా అధికారుల సమక్షంలో నిర్వహించారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులను పరిశీలించిన సామాజిక తనిఖీ బృందం సభ్యులు అట్టి వివారలను ప్రజావేదికలో వెల్లడించారు. అనంతరం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కె లక్ష్మీ నారాయణ ఉపాధి హామీ పనుల పై పలు నిర్ణయాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, విజిలెన్స్ అధికారి రామారావు, ఎంపీడీఓ శ్రీలేఖ, గ్రామ సర్పంచులు, సంబంధిత అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# చదువు కోసం ప్రతిరోజూ మూడు కిలోమీటర్ల నడక..!

**వినతిపత్రాలు ఇచ్చినా స్పందించని ఎమ్మెల్యే, కలెక్టర్, జగిత్యాల డిపో మేనేజర్**



ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : సమయానికి రాని బస్సుతో విద్యార్థుల ఇబ్బందులు, వినతులు ఇచ్చినా స్పందించని అధికారులు, ప్రజాప్రతినిధులు జగిత్యాల మండలంలోని హబ్సీపూర్ గ్రామ విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రయాణికులు రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు నుంచి నాలుగు సంవత్సరాల నుంచి గ్రామానికి సమయానికి ఆర్టీసీ బస్సు రాకపోవడంతో విద్యార్థులు ప్రతిరోజూ సుమారు మూడు కిలోమీటర్లు నడుచుకుంటూ ధర్మపురి జగిత్యాల ప్రధాన రహదారికి తక్కలపెల్లి నుంచి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థులు మండుటెండల్లోనూ, వర్షాకాలంలోనూ కాలినడకన ప్రయాణించడం వల్ల చదువుపై ప్రభావం పడుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు సమయానికి చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా సంవత్సరాల నుంచి ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, జగిత్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి శాశ్వత పరిష్కారం లభించలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

**హబ్సీపూర్ గ్రామానికి నిర్దిష్ట సమయాల్లో ఆర్టీసీ బస్సులు నడపాలి :** విద్యార్థుల ఇబ్బందులను అధికారులు ఎప్పుడు గుర్తిస్తారు, ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలవుతాయి, చదువు కోసం నడక తప్పని పరిస్థితి నుంచి హబ్సీపూర్ విద్యార్థులకు ఎప్పుడు విముక్తి లభిస్తుంది అని హబ్సీపూర్ గ్రామస్థులు అధికారులను ప్రజాప్రతినిధులను పరోక్షంగా ప్రశ్నిస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు, విద్యార్థుల పాఠశాల, కళాశాల సమయాలకు అనుగుణంగా ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉండే విధంగా రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచాలని హబ్సీపూర్ గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇది కేవలం రవాణా సమస్య మాత్రమే కాదు, గ్రామీణ విద్యార్థుల విద్యా హక్కుకు సంబంధించిన అంశమని హబ్సీపూర్ గ్రామ విద్యావంతులు పేర్కొంటున్నారు.

# చర్మవ్యాధుల నివారణకు ఉచిత టీకాలు



ప్రజాపక్షం/గొల్లపల్లి : పశువుల్లో సంక్రమించే వ్యాధుల్లో అధిక శాతం ముందస్తు జాగ్రత్తతో నివారించతగ్గవే.జీవాలకు వ్యాధి రాకముందే టీకాలు మందులను వైద్యుల సలహా మేరకు వాడడం వల్ల అనేక రకాల రోగాల నుంచి పశువులు అధిగమించేలా పాడి రైతులు చూడవచ్చునని మండల పశు వైద్యాధికారి రవీందర్ అన్నారు .జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో ఎద్దులు ,ఆవులు,లేగ దూడలకు లంపి చర్మవ్యాధి (ముద్ద చర్మవ్యాధి ) రాకుండా ముందస్తు లంపీ చర్మ వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామంలో 96 పశువులకు ఉచిత టీకాలు వేశామని తెలిపారు.ఈ సందర్భంగా పశు వైద్యాధికారి రవీందర్ లంపీ చర్మవ్యాధి లక్షణాలు నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ వ్యాధి సోకిన పశువులకు తీవ్రమైన జ్వరం రావడంతో పాటు పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందని అలాగే చర్మంపై నోటిలో బొబ్బలు ఏర్పడి పుండుగా మారడం వల్ల పశువులు మేత నీరు తీసుకోకుండా బలహీనపడి మృత్యువాత పడే,ప్రమాదం ఉంటుందని తెలిపారు .మూడు నెలలు దాటిన దూడలు పెద్ద పశువులకు ఏడాదికి ఒకసారి తప్పనిసరిగా లంపి చర్మ వ్యాధి నిరోధక టీకా వేయించాలని రైతులకు సూచించారు .ఈ టీకాల కార్యక్రమం ఈనెల 14 వరకు మండలంలోని గ్రామాల్లో కొనసాగుతుందని ,తర్వాత గొర్రెలు,మేకలలో పి పి ఆర్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం అన్ని గ్రామాల్లో ఉంటుంది కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి రవీందర్,పశు వైద్య సిబ్బంది గంగాధర్ ,రవీందర్,నర్సయ్య,రమేష్ తో పాటు రైతులు పాల్గొన్నారు.

# ఎల్ ఆర్ ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

**దరఖాస్తుదారులకు ఫోన్, ఎస్ ఎం ఎస్ ద్వారా సమాచారం ఇవ్వాలి**

**మున్సిపల్, ఎంపీడీఓ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలి**

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**




ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : రాష్ట్ర ప్రభుత్వం ఎల్ ఆర్ ఎస్ కింద కల్పించిన రాయితీని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులు, వాటి పురోగతి, రాయితీ తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నీటి పారుదల శాఖ, రెవెన్యూ శాఖ, మున్సిపల్, మండల పంచాయతీ అధికారులతో శుక్రవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎల్ ఆర్ ఎస్ –2020 కింద దరఖాస్తుదారులకు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజులో 25 శాతం రాయితీ కల్పించిందని వెల్లడించారు. ఈ నెల 31వ తేదీ వరకు రాయితీ పొందేందుకు అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఎల్ ఆర్ ఎస్ కింద జిల్లాలో మొత్తం 43,150 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. వీటిలో 5,708 దరఖాస్తుదారులు ఫీజు చెల్లించి.. ప్రక్రియ పూర్తి చేసుకున్నారని తెలిపారు. 3, 316 దరఖాస్తులు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయని తెలిపారు. 6, 051 దరఖాస్తులు అధికారుల పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 28,075 మంది దరఖాస్తులు రాయితీకి అర్హత సాధించి ఉన్నాయని, వాటికి నిర్ణిత ఫీజు చెల్లిస్తే క్రమబద్దీకరణ ఉత్తర్వులు జారీ చేయాలని వివరించారు. దరఖాస్తుల స్క్రూటినీ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. భూములు నీటి వనరుల బఫర్ జోన్ , నాలా, చెరువులు, హెరిటేజ్ బిల్డింగ్ లు, ప్రభుత్వ భూముల క్రమబద్దీకరణకు వచ్చిన దరఖాస్తులను తిరస్కరించాలని ఆదేశించారు.

హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలి: జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాయితీ, దరఖాస్తు విధానం, పూర్తి వివరాలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని, అక్కడ ఒక సహాయకుడు కూడా అందుబాటులో ఉండాలని సూచించారు. ఎల్ ఆర్ ఎస్ కింద దరఖాస్తు చేసుకొని అర్హత ఉన్న వారికి ఎస్ ఎం ఎస్, ఫోన్ ద్వారా సమాచారం చేరవేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి, డీటీసీపీఓ అన్సారీ, తదితరులు పాల్గొన్నారు.

## 24 గంటలలో చోరీ నిందితుడి పట్టివేత

ప్రజాపక్షం/ధర్మపురి : ధర్మపురి పట్టణంలో బుధవారం రాత్రి జరిగిన చోరీ ఘటనను పోలీసులు 24 గంటలలో చేదించారు. దొంగతనానికి పాల్పడ్డ నిందితుడితోపాటు చోరీకి గురైన బంగారం, వెండి, నగదు, ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై గురుక మహేష్ కథనం మేరకు ధర్మపురి పట్టణంలోని రాపర్తి నారా యణ ఇంట్లో బుధవారం గుర్తుతెలియని దుండగులు చొరబడి బీరువాలో వుంచిన 2 తులాల బంగారం ఆభరణాలు,14 తులాల వెండి అపహరణకు గురి కాగా బాధిత కుటుంబ యజమానురాలు లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల ప్రకారం డిఎస్పీ పురుషోత్తం రెడ్డి పర్యవేక్షణలో సీఐ రాం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై జి.మహేష్ కేసును ప్రతిష్టాత్మకంగా చేపట్టి సాంకేతిక ఆధారాలు,సీసీ టీవీ ఫుటేజీల సమాచారంతో తీవ్రంగా శ్రమించి కేసును 24 గంటల్లోనే చేదించి చోరీ అయిన సొత్తును పూర్తిగా రికవరీ చేశారు.కేసును వేగవంతం చేసి చోరీ నిందితుడు (మైనర్)ని పట్టుకుని,చోరీ సొమ్మును పూర్తిగా రికవరీ చేసిన సీఐ రాం నర్సింహా రెడ్డి,ఎస్సై జి.మహేష్ ,సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

## మోడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్‌ను తనిఖీ చేసిన తహసీల్దార్ వరప్రసాద్

ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్‌ను తహసీల్దార్ బి.ఎస్.ఎస్. వరప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా హాస్టల్‌లో విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం (మిడ్‌డే మీల్స్) నాణ్యత, వంటశాల పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ విధానం, తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు.విద్యార్థినులకు నాణ్యమైన,పరిశుభ్రమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందించాలని, పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఆదేశించారు. విద్యార్థినుల ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ హాస్టల్ నిర్వాహణలో అన్ని నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం తహసీల్దార్ విద్యార్థినీలకు దుప్పట్లను అందజేసి విద్యార్థినిలతో కలిసి సహ భక్తి భోజనం చేశారు.

## మహిళా సంఘ భవన నిర్మాణ పనుల ప్రారంభం

ప్రజాపక్షం /పెగడపల్లి : మండల పరిధిలోని రాంబద్రునిపల్లి గ్రామంలో మహిళల చిరకాల కాంక్ష నెరవేరబోతోంది. గ్రామంలో నూ తనంగా నిర్మించ తలపెట్టిన మహిళా సంఘ భవన నిర్మాణ పనులకు శుక్రవారం గ్రామ సర్పంచ్ కాశవేని కుమార్, అధికారులు కలిసి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని మహిళా సంఘాల బలోపేతానికి, వారు సమావేశాలు నిర్వహించుకోవడానికి ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. భవన నిర్మాణాన్ని నిర్ణీత కాలంలో పూర్తి చేసి మహిళలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్ ఎద్దు క్రిష్ణ, పంచాయతీ కార్యదర్శి రమేష్,వార్డు సభ్యులు,గ్రామ మహిళా సంఘాల ప్రతినిధులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పాఠశాలలో నూతన వసతుల పనులకు భూమిపూజ

ప్రజాపక్షం /పెగడపల్లి : మండల పరిధిలోని నామాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల వసతుల మెరుగుదలకు శుక్రవారం నాడు కీలక అడుగు పడింది.పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించ తలపెట్టిన వంట గది మరియు మరుగుదొడ్ల నిర్మాణ పనులకు స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు కలిసి ఘనంగా ముగ్గు పోసి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చిర్ర రజితరమణాకర్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా ఈ నిర్మాణ పనులను చేపట్టినట్లు తెలిపారు.మధ్యాహ్న భోజన పరిరక్షణకు ఆధునిక టాయిలెట్లను త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో లెంకల రజితగంగరాజు, జాగిరి సంతోష్, రాముడుగు వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ,దీకొండ అజయ్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, పంచాయతీ సిబ్బంది,గ్రామస్తులు,పాల్గొన్నారు.

# గెలుపు ఎవరిదో చూపిస్తాం : రాకేష్‌రెడ్డికి మానాల మోహన్‌రెడ్డి సూచన



**ప్రజాపక్షం/భీమ్‌గల్‌:** ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్దలు మహేష్‌కుమార్‌గౌడ్‌పై పసలేని ఆరోపణలు చేసి రాకేష్‌రెడ్డి మెంటల్ స్టెబిలిటీపై ఆయనకు ఆయననే ప్రజలకు తెలియజేస్తున్న పరిస్థితి ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాక ముందు వచ్చిన తర్వాత మా రాష్ట్ర అధ్యక్షులు మహేష్ అన్న గతంలో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నేడు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా ప్రజల పక్షాన ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న వ్యక్తులలో మహేష్‌కుమార్‌గౌడ్ ఒకరు రాకేష్‌రెడ్డి లా పారాషూట్ పట్టుకుని వచ్చి బీజేపీ పార్టీలో టికెట్ కొనుక్కొని పోటీ చేసిన రకం మహేష్ అన్న కాదన్న విషయాన్ని రాకేష్‌రెడ్డి తెలుసుకుంటే బాగుంటది. రాకేష్‌రెడ్డికి తెలిసినవి రెండే విద్యలు ఒకటి యూట్యూబ్ ఛానల్‌లో పిచ్చివాగుడు వాడటం రెండవది బాహ్య ప్రపంచంలో అధికార పార్టీకి సంబంధించిన పెద్దల దగ్గరికి వెళ్లి మొకరిల్లడం ఈ రెండు మాత్రమే తెలిసిన వ్యక్తి రాకేష్ రెడ్డి ఉదయం మహేష్ అన్నని సుదర్శన్‌రెడ్డిని కలిసి పనులు చేయించుకోవటం సాయంత్రం విలేకరుల సమావేశంపెట్టి కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. నేను రాజీనామా చేస్తా పీసీసీ ప్రెసిడెంట్ రాజీనామా చేయాలా మేమిద్దరం పోటీ చేస్తా అన్నావు నిన్ను పిలవడానికి పీసీసీ వరకు ఎందుకు ఈ జిల్లాలో చాలా మంది నాయకులు ఉన్నారు. నీకే అవకాశం ఇస్తున్నాం. ఏ నాయకుడిపై నువ్వు గెలుస్తా అనుకుంటావో ఆ నాయకుడు పేరు చెప్పు నాయకునితో నిన్ను వడగట్టే బాధ్యత కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తీసుకుంటారు. పీసీసీ ప్రెసిడెంట్‌తో పోటీ చేస్తే డిపాజిట్లు కూడా రావు నీకు దమ్ము ధైర్యం ఉంటే సవాల్ విసిరేటప్పుడు గుర్తుంచుకోవాలి రాజీనామా చేయాలనుకుంటే రాజీనామా చేయ్ నీ పైన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలువకుంటే మేము రాజకీయ సన్యాసం తీసుకోవటానికి సిద్ధంగా ఉన్నాం. ఇలా సవాలు ఉండాలి కాఈన పీసీసీని రాజీనామా చేయమను సిఎం రాజీనామా చేయమను ఇలా కాదు మీకు శక్తి నిజంగా ఉంటే ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలు గెలిపించిన రెండున్న సంవత్సరాలలో వాళ్లకు అన్ని రకాల సేవలు అందించాలని నమ్మకం నీకు ఉంటే ఇమిడియట్లీ రాజీనామా చేయు నిన్ను ఓడగొట్టి చూపించలేకపోతే మేం కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వాళ్లమే కాదని ఒప్పుకుంటాము. ఎన్ని అబద్ధాలు చెప్పావు ఎలక్షన్స్ ముందు స్వంత డబ్బులతో ఇల్లు కట్టిస్తా అన్నావు. అబద్ధాలతో ప్రజల్నిమభ్యపెట్టి గెలిచిన నువ్వు ఈ రోజు మా నాయకుడు మహేష్ అన్నపై మాట్లాడటం సిఎం రెండు రోజుల్లో దిగిపోతాడనడం నీ మెంటల్ బ్యాలెన్స్‌కి ఇది పెద్ద ఉదాహరణ. సిఎంపై ఈ రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమాలపై అభివృద్ధిపై ఈ దేశంలో ఉన్న బీజేపీ మంత్రులే వేణుల పొగుడుతుంటే నీవు పిచ్చోళ్ల మాట్లాడుతుంటే నిన్ను ఏమనాలి. అందుకే ఆర్మూర్ నియోజక ప్రజలు ఏమంటున్నారు వన్ టైం వండర్ ఒకసారి అనుకోకుండా గెలిచినటువంటి పరిస్థితి భవిష్యత్తులో గెలిచేది లేదని ప్రజలు అనుకుంటున్నారు. అబద్ధపు మాటలు ఆ సందర్భం ప్రేరాఫలానాలు ఆగకపోతే ఈరవత్రి అనిల్‌పై మాట్లాడుతావు నువ్వు మాట్లాడిన మాటలకు కౌంటర్ ఇచ్చారు. ఈరవత్రి అనిల్ ఎమ్మెల్యే గెలిచారు. మూడు సార్లు పోటీ చేశారు. సిఎంపై చేసిన వ్యాఖ్యలకు తప్పయిందని ఒప్పుకోవాలి నీకు నిజంగా దమ్ముంటే రాజీనామా చేసి చూపి ఇమిడియెట్లీ ఎలక్షన్స్‌కు వెళుదాం.

## స్కానింగ్ సెంటర్ యజమానికి 70 లక్షలకు పైగా టోకరా వేసిన ఉద్యోగులు

### ముగ్గురిపై వన్ టౌన్‌లో కేసు నమోదు ఒకరి అరెస్ట్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** స్కానింగ్ సెంటర్ యజమానికి నమ్మకంగా ఉంటూ లక్షల్లో దోచుకున్న ఇద్దరు ఉద్యోగుల ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉద్యోగుల అక్రమ దోపిడీని గుర్తించిన యజమాని వన్ టౌన్ పోలీసులను ఆశ్రయించటంతో వారి భాగోతం బయట పడింది. లోతుగా విచారణ జరిపిన వన్ టౌన్ పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేసి ఒకరిని అరెస్ట్ చేయగా మరో ఇద్దరిలో పరారిలో ఉన్నట్లు తెలుస్తుంది. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కానింగ్ కేంద్రంలో పని చేసిన ఇద్దరు ఉద్యోగులు నకిలీ నగదు రసీదులు తయారుచేసి సంస్థ యాజమాన్యాన్ని మోసం చేసి దాదాపు రూ.70 లక్షలకు పైగా నగదును కాలేశారనే ఆరోపణలపై 1వ టౌన్ పోలీసులు బాధితుని ఫిర్యాదు మేరకు ముగ్గురిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ రఘుపతి వెల్లడించారు. మరో ఇద్దరు మహిళలు పరారీలో ఉన్నారని వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

## గ్రామ దేవతలకు గంగా జలాభిషేకాలు

**ప్రజాపక్షం/ఎడపల్లిః** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని పోచారం గ్రామంలో గ్రామ కమిటీ, సర్పంచ్ నీరడి జ్యోతి ఆధ్వర్యంలో జాన్కంపేట్ గ్రామంలో సర్పంచ్ అనురాధ కిషన్ గౌడ్, పాలకవర్గం, గ్రామస్తుల ఆధ్వర్యంలో గురువారం వర్షాలు కురవాలని వేడుకుంటూ రైతులు, ప్రజలు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు, జలాభిషేకం నిర్వహించారు. విస్తారంగా వర్షాలు కురిసి చెరువులు జలకళ సంతరించుకోవాలని, పంటలు సమృద్ధిగా పండాలని పిల్లాపాపలతో సుఖంగా ఉండాలని నీళ్ల బిందెలు ఎత్తుకొని ఆలయాలకు చేరుకొని గ్రామ దేవతల విగ్రహాలకు జలాభిషేకాలు చేశారు.

## జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన ఎస్ఆర్ విద్యార్థిని

### సన్మానించిన ఎస్ఆర్ డిజిఎం గోవర్ధన్‌రెడ్డి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎస్ఆర్ కళాశాల విద్యార్థిని నవాతే మేఘన ఎంపికైనట్లు ఎస్ఆర్ జూనియర్ కళాశాల డీజీయం గోనె గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎస్ఆర్ కళాశాలలో విద్యార్థినిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జూన్ 24న హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ అంబర్‌పేట్ స్విమ్మింగ్ పూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థిని నవాతే మేఘన అత్యుత్తమంగా ప్రదర్శించిందని, ఈనెల 5 నుంచి తమిళనాడు రాష్ట్రంలో జరగనున్న స్విమ్మింగ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావటంగర్వంగా ఉందన్నారు. మా కళాశాల నుంచి చదువుతో పాటు రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి క్రీడా పోటీలకు కూడా అధిక ప్రాధాన్యతనివ్వటం జరుగుతుందన్నారు. చదువులో ఐఐటి, జెఈఈ, ఎంసెట్ రాష్ట్రస్థాయి ర్యాంకులతో పాటు క్రీడల్లో రాష్ట్రస్థాయి జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొనడం మా జూనియర్ కళాశాలకు మంచి పేరు తీసుకొస్తున్న విద్యార్థులకు అభినందనలు, తల్లిదండ్రులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి శ్రీకాంత్, డీన్ రాంబాబు, అకౌంటెంట్ రమేష్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు హన్మంతరావు, దేవేందర్‌రెడ్డి, యాగేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మురళి, మహిపాల్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## నమ్మకాన్ని వమ్ముచేసి లక్షలు కాజేసే..



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** నమ్మకాన్ని వమ్ము చేసి స్కానింగ్ సెంటర్ యజమానికి నమ్మకంగా ఉంటు లక్షల్లో దోచుకున్న ఇద్దరు ఉద్యోగుల ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉద్యోగుల అక్రమ దోపిడిని గుర్తించిన యజమాని 1వ టౌన్ పోలీసులను ఆశ్రయించడంతో వారి బాగోతం బయటపడింది. నిజామాబాద్‌లో ఒక స్కానింగ్ సెంటర్ యజమానికి 70 లక్షలు పైగా టోకరా వేసిన ఉద్యోగుల ఉదంతం. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేటు స్కానింగ్ కేంద్రంలో పనిచేసిన ఇద్దరు ఉద్యోగులు గుండారం సత్యనారాయణ, మీనా నకిలీ నగదు రసీదులు తయారుచేసి, సంస్థ యాజమాన్యాన్ని మోసం చేసి రూ. 70 లక్షలకు పైగా నగదును కాజేశారనే ఆరోపణలపై 1వ టౌన్ పోలీసులు బాధితుని ఫిర్యాదు మేరకు ముగ్గురిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేయడం జరిగిందని 1వ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. కేసును లోతుగా పరిశీలించిన తరువాత వన్ టౌన్ పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేసి, ఒకరిని అరెస్టు చేయగా మరో ఇద్దరు పరారీలో ఉన్నట్టు తెలిపారు. ఆ ప్రయివేటు స్కానింగ్ సెంటర్ 2009 సంవత్సరం నుంచి నిజామాబాద్‌లో సేవలు అందిస్తోంది. ఈ కేంద్రంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న గుండారం సత్యనారాయణ, టి. మీనాలు కలిసి పథకం ప్రకారం సంస్థను మోసం చేసినట్టు ఆరోపణలు ఉన్నాయన్నారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, రోగులకు ఇచ్చే అసలు నగదు రసీదుల్లో కార్బన్ పేపరు తొలగించి, అనంతరం అదే బిల్లు నెంబర్ పరీక్షల వివరాల మొత్తాలను తక్కువగా చూపిస్తూ నకిలీ రికార్డులు తయారుచేసినట్టు ఫిర్యాదులో వెల్లడించడం జరిగిందన్నారు. రోగులకు అసలు మొత్తంతో కూడిన రసీదు ఇచ్చిన తరువాత, కార్యాలయ రికార్డుల్లో మాత్రం పరీక్షల వివరాలు, ఫీజులను మార్చి నమోదు చేయడం ద్వారా రోజువారి నగదును దుర్వినియోగం చేసినట్టు పేర్కొన్నారు. ఈ విధానం సుమారు ఆరు సంవత్సరాలుగా కొనసాగిందని, ఈ కాలంలో రూ. 70 లక్షలకు పైగా సంస్థకు నష్టం వాటిల్లినట్టు పిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు. అంతేకాకుండా, ఈ అక్రమాల గురించి ఇతర ఉద్యోగులు వెల్లడించకుండా వారిని బెదిరించడం, కొన్ని ఆధారాలను మాయం చేయడానికి ప్రయత్నించినట్టు తెలిపారు. ఇందుకు సంబంధించి 2025 జనవరి నుంచి జూలై వరకు ఉన్న కొన్ని నగదు రసీదుల ప్రతులను పోలీసులకు సమర్పించినట్టు ఫిర్యాదులో వివరించారు. ఫిర్యాదు స్వీకరించిన ఒకటవ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. అక్రమంగా యజమానికి టోకరా వేసిన డబ్బులతో గుండారం సత్యనారాయణ తన భార్య పేరిట భారీగా ఆస్తులు కొనుగోలు చేసినట్టు విచారణలో వెల్లడైందన్నారు.

## పాఠశాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/బాల్కొండ :** మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌ను లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ వి.భుజంగరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ పర్యటనలో భాగంగా పాఠశాల మౌలిక వసతులు, విద్యార్థులకు అందుతున్న బోధనా ప్రమాణాలు, ఉపాధ్యాయుల ఖాళీల వివరాలు మధ్యాహ్న భోజన నాణ్యత, తరగతి గదుల నిర్వహణపై సమగ్రంగా సమీక్షించి విద్యార్థుల హాజరు శాతాన్ని, తరగతి గదుల్లో ఉపాధ్యాయులు బోధిస్తున్న విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులకందుతున్న మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం, పరిసరాల పరిశుభ్రతపై ఆరా తీశారు. విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపర్చటానికి ఉపాధ్యాయులకు, సంబంధిత విద్యాశాఖాధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బట్టు రాజేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం



**ప్రజాపక్షం/బాల్కొండ :** మండల కేంద్రంలోని శివశంకరవాడలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభించి గృహప్రవేశం చేసి మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో నిరుపేదలకు గృహనిర్మాణం కోసం రూ.5లక్షలు మంజూరు చేయటంతో అర్హులందరికి దశల వారిగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా లబ్ధి పొందిన వారు మంజూరు చేయించిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సునీల్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, యూనియన్ కోఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంజీవ్‌గౌడ్, రాజేందర్, యూనిస్, అరవింద్, ఇమ్రాన్‌ఖాన్, శ్రీనివాస్, విద్యాసాగర్, దయాకర్, నవీన్‌కుమార్, సాయన్న, రవి, మల్లేష్‌యాదవ్, అశోక్ పాల్గొన్నారు.

## బోరు బావుల కింద వరినాట్లు



**ప్రజాపక్షం/జక్రాన్‌పల్లిః** నిజామాబాద్ జిల్లా జక్రాన్ పల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో బోరు బావుల కింద రైతన్నలు వరినాట్లు వేస్తున్నారు. శుక్రవారం జక్రాన్‌పల్లి మండలంలో స్వల్ప వర్షం కురిసింది. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ మండలంలో ఇంకా పుష్కలంగా వర్షాలు పడకపోవడంతో రైతులు బోరు బావుల కింద మాత్రమే వర్షాలు వేస్తున్నారు. జోరుగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండితే పూర్తిస్థాయిలో రైతులు పంటలు సాగు చేసేందుకు సమాయత్తమై ఉన్నారు.

## ఫారాలు పూర్తి చేసి బిఎల్‌ఓలకు సమర్పించాలి

ప్రజాపక్షం / జైనూర్ : ఎన్యుమేరేషన్ ఫారాలను పూర్తి చేసిన వెంటనే సంబంధిత బూత్ స్థాయి అధికారులకు (బిఎల్ఓ) సమర్పించాలని జైనూర్ తహశీల్దార్ అడా బిర్ షావ్ సూచించారు. శుక్రవారం తహశీల్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా అందించిన ఎన్యుమేరేషన్ ఫారాలను పూర్తి చేసి ఆలస్యం చేయకుండా అందజేయాలని తెలిపారు. సమయానికి ఫారాలు సమర్పించడంతో ఓటరు జాబితా నవీకరణ ప్రక్రియ వేగవంతంగా, పారదర్శకంగా పూర్తవుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఈ కార్యక్రమానికి సహకరించి తమ ఫారాలను త్వరగా పూర్తి చేసి సమర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## జడ్‌పి పాఠశాలలో పిఎం శ్రీ నిధులపై జడ్‌పి సిఇఒ తనిఖీలు



ప్రజాపక్షం / సిర్పూర్ (టి) : సిర్పూర్ (టి) మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పీఎం శ్రీ పథకం నిధుల వినియోగంపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సిఇఒ) ఆర్. లక్ష్మీ నారాయణ శుక్రవారం పాఠశాలను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంబంధిత బిల్లులు, వోచర్లు, స్టాక్ రిజిస్టర్లు, ఇతర ఆర్థిక లావాదేవీల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాల ఆవరణలో పనులను పర్యవేక్షించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్‌పి సిఇఒ మాట్లాడుతూ పిఎం శ్రీ నిధుల వినియోగానికి సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. తనిఖీల్లో సేకరించిన వివరాలు, రికార్డుల ఆధారంగా సమగ్ర నివేదికను సిద్ధం చేసి జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని, కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ తనిఖీల సమయంలో ఎంపిడిఒ కోట ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు సదాశివుడు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ ప్లేట్లకు బదులు స్టీల్ ప్లేట్లను వాడాలి

ప్రజాపక్షం/బాల్కొండ : మండలంలోని కిసాన్‌నగర్‌లో గ్రామంలో పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఉన్నతమైన ఉద్దేశ్యంతో గ్రామపంచాయతీ కార్యాలయంలో స్టీల్ ప్లేట్లను అందజేశామన్నారు. ప్లాస్టిక్ ప్లేట్లకు బదులుగా స్టీల్ ప్లేట్లను ప్రోత్సహించేందుకు గాను ప్రముఖ కాంట్రాక్టర్ దేవారెడ్డి, శరత్ కలిసి 100 స్టీల్‌ప్లేట్లను, 50 స్టీల్ గ్లాసులను గ్రామపంచాయతీకి ఉచితంగా అందించగా సర్పంచ్ రాంరాజ్‌గౌడ్ చేతుల మీదుగా అందజేసి మాట్లాడారు. గ్రామాల్లో జరిగే శుభకార్యాలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్లాస్టిక్ రహిత వాతావరణాన్ని తీసుకురావటానికి ఈ స్టీల్ సామాగ్రి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. దాతల ఉదార స్వభావానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# సహజ వ్యవసాయంతోనే నేల సారాన్ని పెంచాలి

మండల వ్యవసాయ అధికారి చల్లా ప్రభాకర్



ప్రజాపక్షం / కాసిపేట : సహజ వ్యవసాయం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకొని నేల సారాన్ని పెంచాలని మండల వ్యవసాయ అధికారి చల్లా ప్రభాకర్ కోరారు. కాసిపేట మండలం మాల్కేపల్లి గ్రామంలో జాతీయ సహజ వ్యవసాయ మిషన్ (ఎన్ఎమ్ఎన్ఎఫ్) ఆధ్వర్యంలో సహజ వ్యవసాయ పద్ధతులపై రైతులకు శుక్రవారం అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులను గుర్తించి 125 ఎకరాల విస్తీర్ణంలో సహజ వ్యవసాయాన్ని అమలు చేసేందుకు క్లస్టర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులకు జీవామృతం, ఘన జీవామృతం, బీజామృతం తయారీ, మల్చింగ్, అంతర పంటల విధానాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత వానాకాలంలో సూపర్ ఎల్‌నినో ప్రభావం వల్ల తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున పంట మార్పిడి విధానాలు అవలంబించాలని సూచించారు. రసాయనిక ఎరువులను తగ్గించి, యూరియా బుకింగ్ యాప్ వినియోగించుకోవాలన్నారు. వరి సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రకటించిన బిపిటి 5204, కెఎన్ఎమ్1638, ఆర్ఎన్ఆర్15048, జై శ్రీరామ్, హెచ్ఎంటి సోనా, కెఎన్ఎమ్7715, డబ్ల్యుజిఎల్ 44 రకాలకే బోనస్ వర్తిస్తుందని స్పష్టం చేశారు. సహాయ వ్యవసాయ సంచాలకులు రాజా నరేందర్, వ్యవసాయ విస్తరణ అధికారి కె. నాగ దీప్తి, రైతులు పాల్గొన్నారు.

## భారీ వర్షంలోనూ కొనసాగుతున్న అధికారుల రిలే నిరాహార దీక్ష



ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సిఎమ్ఒఎఐ) పిలుపు మేరకు శ్రీరాంపూర్ ఏరియా అధికారులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం ఐదవ రోజుకు చేరుకున్నాయి. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అధికారులు శాంతియుతంగా తమ నిరసనను కొనసాగించారు. పే అనామలీస్, పిఆర్‌పి బకాయిల చెల్లింపుతో పాటు ఇతర ప్రధాన డిమాండ్లపై యాజమాన్యం నుండి స్పష్టమైన హామీ లభించే వరకు ఆందోళనలు ఆపేది లేదని అధికారులు స్పష్టం చేశారు. సాయంత్రం పెద్ద సంఖ్యలో ఏరియా అధికారులు దీక్షా శిబిరానికి చేరుకుని దీక్షలో కూర్చున్న వారికి సంఘీభావం ప్రకటించారు. యాజమాన్యం వెంటనే స్పందించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. జూలై 13 వరకు నిర్వహించే రిలే నిరాహార దీక్షలను విజయవంతం చేసేందుకు అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సిఎమ్ఒఎఐ నాయకులు పిలుపునిచ్చారుదీక్షలో సిఎమ్ఒఎఐ జాయింట్ సెక్రటరీ బీమన్న, డివై పిఎం క్రాంతికుమార్, ఆర్‌కె 7 అండర్ మేనేజర్ నరేష్, ఐకె ఓసి డివై ఎస్ఇ గుత్తుల శ్రీనివాస్, ఐకె ఐఎ సీనియర్ అండర్ మేనేజర్ సాయితేజ, ఆర్‌కె ఎన్‌టి సీనియర్ పిఓ సృజన్ పాల్, ఆర్‌కె 5 సీనియర్ పిఓ హరికృష్ణ, ఎస్ఆర్‌పి 1 డిప్యూటీ మేనేజర్ నరేష్, ఎస్ఆర్‌పి ఓసి అండర్ మేనేజర్ తిరుపతి పాల్గొన్నారు.

## కుల బహిష్కరణ చేయలేదు.. అన్ని అసత్య ఆరోపణలే




ప్రజాపక్షం /బెల్లంపల్లి : తమను కుల బహిష్కరణ చేశారంటూ పవన్, మంజుల దంపతులు చేసిన ఆరోపణలు ముమ్మాటికీ అసత్యమని బెల్లంపల్లి మండల చంద్రవెల్లి గ్రామ యాదవ సంఘం ప్రతినిధులు స్పష్టం చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పొలవేణి పవన్, మంజుల దంపతులకు, పోలవేన రాజుకు మధ్య ఉన్న భూవివాదంపై సంఘం వద్దకు ఫిర్యాదు రాగా ఇరువర్గాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశామని తెలిపారు. సంఘం నిర్ణయం నచ్చని పవన్, మంజుల దంపతులు ప్రతినిధులను దూషించడమే కాకుండా, తాము రాజుకు మద్దతు ఇస్తున్నట్లు భావించి కుల బహిష్కరణ చేశారంటూ అప్రతిష్టపాలు చేస్తున్నారని మండిపడ్డారు. అన్నదమ్ముల మధ్య ఉన్న భూవివాదాలు పోలీసుల వరకు వెళ్లాయని, వారు చెప్పినా వినకుండా దంపతులు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుల బహిష్కరణ చేసే అధికారం తమకు లేదని, అసత్య ఆరోపణలు మానుకొని ఇరువర్గాలు సంప్రదింపులతో సమస్యలు పరిష్కరించుకొని అందరితో కలిసిమెలిసి ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పోలవేణి మొండి, పోలవేణి రాజు, రంగ నాగరాజు, కొమ్ము రాజేష్, పెద్దగుల సమ్మయ్య పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియకు మూడు నెలల గడువు ఇవ్వాలి

ప్రజాపక్షం / కాగజ్ నగర్ : రాష్ట్రంలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రతి అర్హ ఓటరు తమ వివరాలను నమోదు చేసుకునేందుకు కనీసం మూడు నెలల గడువు కల్పించాలని ఎంపిజె రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ మజీద్ షోయబ్ డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఎంపిజె కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో సరైన అవగాహన లేదన్నారు. దరఖాస్తు ఫారాలు ఎలా నింపాలి, ఏ పత్రాలు జత చేయాలి, ఎక్కడ సమర్పించాలనే అంశాలపై చాలా మంది ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కనీసం మూడు నెలల గడువు ఇస్తే ప్రతి ఒక్కరూ అవసరమైన పత్రాలను సమర్పించి తమ ఓటరు హక్కును పరిరక్షించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో ఎంపిజె ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై ఇంటింటికీ వెళ్లి దరఖాస్తులు నింపడం, అవసరమైన పత్రాల వివరాలు తెలియజేస్తూ అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో ఎమ్పిజె కాగజ్ నగర్ అధ్యక్షుడు ఫరాజ్ అహ్మద్, మహమ్మద్ జలాలుద్దీన్, మహమ్మద్ హర్షద్ పాల్గొన్నారు.




## జాతీయ సదస్సుకు జిల్లా డిపిఆర్ఒ సంపత్ కుమార్ ఎంపిక



ప్రజాపక్షం / ఆసిఫాబాద్ : న్యూఢిల్లీలో నిర్వహించనున్న మీడియా, కమ్యూనికేషన్ అధికారుల జాతీయ సదస్సులో పాల్గొనేందుకు కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పౌర సంబంధాల అధికారి (డిపిఆర్ఒ) సంపత్ కుమార్ ఎంపికయ్యారు. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలోని ఇండియా ఇంటర్నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్ మెంట్ (ఐఐఐడిఇఎం)లో ఈ సదస్సు జరగనుంది. దేశవ్యాప్తంగా ఎంపికైన మీడియా, కమ్యూనికేషన్ అధికారులతో కలిసి ఆయన ఈ సదస్సులో పాల్గొంటారు. ఈ సదస్సులో భాగంగా మీడియా నిర్వహణ, ప్రజా కమ్యూనికేషన్, ఎన్నికల సమాచార ప్రచారం, ఆధునిక సమాచార వ్యూహాలు, డిజిటల్ కమ్యూనికేషన్ వంటి పలు అంశాలపై నిపుణులు నిర్వహించే సాంకేతిక సెషన్లలో సంపత్ కుమార్ పాల్గొని అవగాహన పెంపొందించుకోనున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికైన కొద్ది మంది అధికారుల్లో ఆసిఫాబాద్ జిల్లా డిపిఆర్ఒ సంపత్ కుమార్ ఒకరు కావడం విశేషం.

## కెజిబివి విద్యార్థినులకు యూనిఫారాల పంపిణీ



ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో శుక్రవారం విద్యార్థినులకు యూనిఫారాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, నస్పూర్ కార్పొరేటర్ యోగిత యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థినులకు యూనిఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కెజిబివి నస్పూర్ ప్రత్యేక అధికారి ఎన్. మౌనిక, సెక్టోరల్ అధికారి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రొటీగూడ రహదారికి బీటీ రోడ్డు మంజూరు



ప్రజాపక్షం / జన్నారం : జన్నారం మండలంలోని రొటీగూడ గ్రామానికి మహమ్మదాబాద్ నుండి వెళ్లే రహదారికి పంచాయతీరాజ్ శాఖ హ్యామ్ పథకం ద్వారా బీటీ రోడ్డు మంజూరైంది. రహదారిపై గుంతల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ చొరవతో ఈ నిధులు మంజూరయ్యాయి. రోడ్డు మంజూరైన సందర్భంగా గ్రామంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్ల లక్ష్మణ్, మాజీ ఉప సర్పంచ్ భారతపు సత్యనారాయణ, గోనె గట్టయ్య, పులిశెట్టి లావణ్య నాగేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.